# భార్య మంచిదయితే....

శ్రీ కొంపల్లి బ్రహ్మానందరావు.

అప్పుడే కాలేజీ నుంచి ఇంటికి వచ్చి బట్టలు మార్చుకుంటూండగా, భార్య సరస్వతి ప్రవేశించింది, మూర్తి ఉన్న గదిలోకి

"నా కోసం సూరి వచ్చాడా?" అని అడిగాడు అద్దం ఎదుట తల దువ్వుకుంటూ

"ఊహుఁ రాలేదు" అని జవాబు వచ్చింది

"పోనీ మరెవరయినా వచ్చారా?" అని అడిగాడు మూర్తి వెనక్కి తిరిగి భార్య వైపు చూసి

"ఏమో, వచ్చినట్టులేదు అయినా మిద్దెమీద గదిలో చూసి రండి "

మూర్తి మాట్లాడలేదు పని ముగించుకొని, పెట్లో నుంచి పర్సు తీసి జేబులో పెట్టుకుని మేడమీది గదిలోకి పోయి చూశాడు గదిలో ఎవరూ లేరు మళ్ళీ దిగి వచ్చి "అయితే నేను పోతున్నాను ఎవరయినా వస్తే క్లబ్బుకు రమ్మను" అని చెప్పి వెళ్ళిపోయాడు

వెళుతున్న మూర్తితో ఏదో చెప్తామని ప్రయత్నించింది, సరస్వతి కాని నోట్లోనుంచి మాట బయటికి రాకముందే మూర్తి గేటు దాటి బయటికి వెళ్ళిపోయాడు బరువైన హృదయంతో ఆమె వెనక్కి తిరిగి ఇంట్లోకి పోయింది

వసారాలో లైటు ముందు కూర్చుని భర్త రాకకై ఎదురు చూస్తూంది టైం ఎనిమిది గంటలయింది ఆమెకెదురుగా అత్తగారు కూర్చుని ఉంది పది నిముషాలు గడిచింది జట్కాలోంచి మూర్తి దిగాడు కూర్చున్న సరస్వతి లేచి నిలబడింది మూర్తితో బాటు మరిద్దరు లోపలికి వచ్చారు వాళ్ళను పైగదిలోకి పొమ్మని తను క్రింద బెడ్ రూంలోకి పోయాడు ఈలోపల సరస్వతి మంచెంబూ నీళ్ళతో ఎదురుగా వచ్చి "కాళ్ళు కడుక్కోండి" అంది

మూర్తి కాళ్ళు కడుక్కొని భార్య పెట్టిన భోజనాన్ని తింటాన్కి ఉపక్రమించాడు "అంత త్వరగా ముగిస్తున్నారేమండీ!" అని అడిగింది చల్ల పోసుకుంటూన్న భర్తను

"టైం లేదు త్వరగా పోవాలి "

"ఇప్పుడే గదండీ ఇంటికి వచ్చిందీ" అని అసంపూర్ణంగా వదిలేసింది

"సూరి వాళ్ళు వచ్చి కూర్చున్నారు చదవ వలసినవి చాలా ఉన్నయ్" అని విస్తరి ముందు నుంచి లేచాడు

మూర్తి జవాబు సరస్వతిని తృప్తిపర్చలేదు మెట్ల మీద చప్పుడు విని వాకిటి తలుపు వేసుకుని లోపలికి వెళ్ళిపోయింది

అత్తగార్కి వడ్డించి, తను వడ్డించుకుంది ఆమె "అబ్బాయి పైకి పోయాడా?" అని అడిగింది భోంచేస్తూ అత్తగారు

"వెళ్ళారు" అని జవాబిచ్చింది

"వాడికి చదువుమీద ధ్యాస ఎక్కువయిపోయింది మరి ఆ దైవ విధి ఎలాగుందో! సరేగానీ, ఒసేయ్, వాడికి సమయానికి అన్నీ అందిస్తూ ఉండు పరీక్షలు కూడా దగ్గర పడుతున్నాయి "

సరస్వతి మాట్లాడలేదు భోజనం ముగించి లేచింది

ఆరోజు ఆదివారం ఉదయం భోంజేసి వెళ్ళిన మూర్తి మధ్యాహ్నం క్రిందకు దిగి భార్య ఇచ్చిన కాఫీ త్రాగాడు మళ్ళీ పైకి వెళ్ళి చదువులో నిమగ్నుడయ్యాడు సాయంత్రం అయిదు అయే సరికి మళ్ళీ క్రిందకు వచ్చి స్నానంచేసి మంచి బట్టలు ధరించాడు, క్లబ్బుకుపోవాలనే ఉద్దేశ్యంతో

"పిక్చరు ప్యాలెస్‌లో మంచి సినిమా ఉందిట వీలు ఉంటే " అని పూర్తి చెయ్యకుండా వదిలేసింది, భర్త ఏమంటాడో అని ఎదురుచూస్తూ

"నేను చదువుకోవాలి నువ్వు వెళ్ళేట్లయితే వెళ్ళు అభ్యంతరంలేదు "

"మీరు రాకుండా నేను ఎలా వెళతాను, వద్దులెండి" అంది

"ఫర్వాలేదు నువ్వూ, అమ్మా వెళ్ళండి జేబులో పర్సు ఉంది తీసుకో "

"ఈమారు అంతా కల్సి వెళదాంలెండి "

"సరే మీయిష్టం వచ్చినట్లు ఏడ్వండి" అని వీధిలోకి పోయాడు మూర్తి

చెమ్మగిల్లిన నేత్రాలను కొంగుతో అద్దుకొని బలవంతంగా వెనక్కు తిర్గి లోపలికి వెళ్ళింది

రాత్రి కొంచం పొద్దుపోయాక మూర్తి ఇంటికివచ్చాడు రోజూ లాగానే మౌనంగా భోజనం ముగించాడు భార్య ఇచ్చిన వక్కపొడ్ని వేసుకుని పై రూంలోకి పోవటానికి సిద్ధమయ్యాడు

"ఈ రోజు క్రింద పడుక్కుందురూ, వెన్నెల రాత్రి కబుర్లు చెప్పుకుంటూ నిద్రపోవచ్చు."

"నాకు వీలు ఉండదు బాటనీ రికార్డు పూర్తిచెయ్యాలి ఎప్పటికో నిద్రపోతాను నాతోబాటు నువ్వుకూడ మేల్కొటం ఎందుకూ?"

"ఈరోజు ఆదివారం కదా కొంచం విశ్రాంతి తీసుకోండి పొద్దస్తమానమూ చదువు గురించే అయితే, ఆరోగ్యం పాడవు తుంది "

"నా జీవితం ఇప్పటికే చాలా పాడైంది ఇంక చదువు కూడా మందగించిందంటే, వేరే చెప్పనవసరం లేదు "

"ఏం? ఎందుకు చెడిపోయింది?"

"ఇంట్లో భార్యతో సరసాలూ, ముచ్చట్లూ మొదలు పెడితే ఈ ఏడు బుర్ర గొరిగించుకొన్నట్లే "

సరస్వతికి అర్ధమయింది, భర్త ధోరణి అయినా పరీక్ష చేద్దామనే ఉద్దేశ్యంతో, "భార్యతో ముచ్చట్లు చేస్తే చదువులు నాశనం అవుతాయా" అని అడిగింది

"తప్పకుండా"

"అయితే ముచ్చట్లు చెయ్యకుండా ఉన్నవారంతా బాగు పడ్డారా?"

"అహాఁ నా దృష్టిలో చాలామంది "

"చాలా పొరపాటు పడుతున్నారు భర్తయొక్క చదువును భార్య ఏవిధంగానూ చెరపదు ఎంతసేపట్కి భర్త పైకి రావాలనే దృష్టితో చూసుకుంటుంది భార్య "

"ఒకరి సంగతి నాకు అనవసరం నామట్టుకు నాకు నిన్ను వివాహం అంత త్వరగా చేసుకున్నందువల్ల నా చదువు వెనక పడ్డమాట నిజం ఇంక నా కాలం అంతా నీతో గడుపుతుంటే పరీక్షల దారిన పరీక్షలు పోతాయి, మన దారిన మనం పోవాలి "

"నాకు తెలీక అడుగుతాను, కట్టుకున్నభార్య ఏవిధంగా అడ్డువస్తుందో చెప్పండీ! భార్యతో కులాసాగా కబుర్లు చెప్పి ఆమెను తృప్తిపర్చి మీదారిన మీరు చదువుకోవచ్చు"

"తీపి రుచి చూచిన తరువాత, చేదు రుచి చూడలేం సుఖభోగాలకి అలవాటయినతరువాత చదువు రంధికాదు "

ఆరాత్రి తనతో ఉండమని సరస్వతి బ్రతిమలాడింది కాని మూర్తి ఇష్టపడలేదు. భార్య తన చదువుకు పూర్తి భంగకరమని నమ్మిన మూర్తిని ఒప్పించటానికి ఆమెకు సాధ్యం కాలేదు భార్యను కట్టుకున్నది ఆమెకు పూర్తి తృప్తినిచ్చి తను తృప్తి పొందటానికి, అని మూర్తి తెలుసుకోలేకపోయాడు, తన విద్య ధోరణిలో ఉండి

రోజూలాగానే మూర్తి స్నేహితులతో పైన, భార్య క్రింద, పడుకున్నారు

మరునాడు సరస్వతి అత్తగారు తనని పిల్చి, "అబ్బాయి రాత్రి క్రింద పడుకున్నాడా? పైనే పడుక్కున్నాడా?" అని అడిగింది

జరిగిన సంగతి అసంపూర్ణంగా చెప్పింది కోడలు ఏదో బాధపడుతున్నట్లుగా గ్రహించింది అత్తగారు

"ఒరేయి అబ్బాయి ఇలారా" అని పిల్చింది మెట్లమీద నుంచి దిగుతూన్న మూర్తిని

"భార్యను ఇంటికి తెచ్చుకున్నావుగదా, నీపాటికి నువ్వు ఇల్లు పట్టించుకోకుండా ఉంటే ఏమనుకున్నావురా?" అని అడిగింది

# భార్య మంచిదయితే.

"నేను దాన్ని ఇంటికి తెచ్చుకోలేను, నువ్వే సంపాదించి తెచ్చుకున్నావ్"

"అదేమిట్రా అలా అంటావు. నేను తీసుకురావడమేమిటి? పెళ్ళి చేసుకున్నది కాపురానికి తెచ్చుకోవటానికి గదూ?"

"ఇపుడప్పుడే ఆ కార్యం సంగతి నాదగ్గర ఎత్తవద్దు వద్దంటూంటే చిన్నప్పుడే నామెడకు కట్టారు నా చదువు పూర్తయి ఒకచోట స్థిరపడిందాక ఆ గోడు పట్టించుకోదల్చలేదు"

"ఏమో నాయనా మీకు తెలీదు పెద్దవాళ్ళు చెప్తే వినరు వయస్సు నిండిన పిల్ల ఇంట్లో ఎన్ని అగచాట్లు పడుతుందో తీసి జ్ఞానం ఉండక్కర్లే? రామయ్యగారి కోడలు చూడు నిన్నగాక మొన్న కాపురానికి వచ్చిందో లేదో అపుడే ఒక పిల్లవాడు కూడా" అని అంది తల్లి కాని తల్లి మాటలను పెడచెవినిపెట్టాడు భార్య, చదువుకు ఒక పెద్ద ఆటంకం అని అతుక్కుపోయింది మూర్తి మనస్సులో

మూర్తి తన కాలాన్నంతా చదువుమీదనే వినియోగించి పరీక్షకు వెళ్ళాడు పరీక్ష బాగా వ్రాశానని తృప్తి పడ్డాడు ఫలితాలకోసం ఎదురు చూచాడు రెండు నెలలు తర్వాత వచ్చినయ్

కాని మూర్తి చదువు బురదలో పన్నీరయింది మూర్తి పరీక్ష పోయింది అతను దిగజారిపోయాడు దిగులుతో మంచం ఎక్కాడు

అయిపోయిందానికి దిగులు దేనికని తల్లి చెప్పింది పడ్డ శ్రమ అంతా వృధా అయినందుకు మూర్తి పరిస్థితి విషమించింది

పెద్ద డాక్టర్లంతా పరీక్ష చేశారు రెండు రోజులలతని పరిస్థితి ఎక్కువయింది ప్రాణాపాయంలో కొట్టుకున్నాడు

దుఃఖంలో మునిగిన భార్య సరస్వతి అస్తమానమూ మూర్తి మంచందగ్గిర కూర్చుని కంటికి రెప్పలా పరిచర్యల్లో లోపం రాకుండా కాపాడుకుంది అదృష్టవశాత్తు బతికాడు మూర్తి

కొన్నిరోజులయిన తరువాత కోలుకున్నాడు మళ్ళీ చదువురంధిలో పడ్డాడు

"బాగా కోలుకున్నంతవరకూ చదువుకు స్వస్తి చెప్పకూడదూ?" అని అడిగింది సరస్వతి ఒకరోజున భర్తను

"వీల్లేదు" అన్నాడు మూర్తి

"అంతబాగా చదివారుకదా, ఎందుకునెగ్గలేదు?"

"ఖర్మ" అన్నాడు మూర్తి

"ఖర్మగాదు చేతులారా చేసుకున్నపని" అంది అటు తిరిగి

"బాగా చదవలేదంటావు అంతేగా?"

"కాదు చదవటానికి చదివారు కాని అది బుర్రకి ఎక్కే విధంగా చదవలేదు భార్యతో కలిసి ఉండి చదివే చదువు వేరు ఊళ్ళో మిత్రులతో తిరుగుతూ చదివిన చదువు వేరు"

"అంటే నీతో సరిగా ఉండకపోవటం వలన తప్పానంటావా?"

"పూర్తిగా కాకపోయినా కొంత అవిధంగా తలచవచ్చు నిజానికి మీ చదువుకు నేను ఎలా అడ్డం వచ్చేదాన్ని? కమ్మగా భోజనం చేసిపెట్టే, తృప్తిగా పూర్తి చేసి నాతో కొంతసేపు గడిపి తరువాత మీ చదువుకు పోండి నేను కాదంటానా? అలాచేస్తే మీ హృదయానికి, మెదడుకూ కొంత ఉపశమనం దొరుకుతుంది అంతేకాని, పొద్దస్తమానమూ అదే ధ్యాస అయితే, విసుగూ, విసుగుమీద విరక్తి ప్రారంభమయి బుర్రకు ఎక్కదు నా దృష్టిలో మీరు తప్పిన కారణం అదే అంటాను"

"నువ్వు చెప్పినట్లు చేస్తే ప్యాసు అవుతానంటావా?"

"తప్పకుండా, చూడండి" అంది నవ్వుతూ

ఆదేశానుసారం మూర్తి ఇంట్లో హాయిగా ఉండి, పరీక్షకు వెళ్ళాడు

పరీక్ష ఫలితాలు వచ్చాయి మూర్తి అమితానందంలో మునిగాడు

"ఆడది అనుకుంటే క్షణంలో సాధిస్తుంది మొదట్లోనే నేను చెప్పినట్లు వింటే ఎంత బాగుండేది!" అన్న మాటలు భార్య నుంచి వచ్చినయ్.

కొడుకూ, కోడలూ కలసి భోజనం చేస్తూ ఉంటే తల్లి మురిసి పోయింది ★